

ఉత్సాహంగా ఉప్ప సాగు

నరసాపురం తీర ప్రాంతంలో ఉప్పసాగు ఉత్సాహంగా సాగుతోంది. ఎన్నడూ లేని విధంగా ఉప్పనకు గిట్టుబాటు ధర పెరగడంతో రైతులు ఆనందిస్తున్నారు. 8లో ▸




గంజాయి స్వాధీనం

కలపర్రు టోల్‌ప్లాజా వద్ద కారులో తరలిస్తున్న 160 కిలోల గంజాయిని ఎస్‌ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 8లో ▸

పశ్చిమ జట్ల హవా

రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ బాలబాలికల జట్లు సత్తా చాటుతున్నాయి. యూత్ బాస్కెట్‌బాల్ పోటీల్లో ఫైనల్స్‌కు చేరడమే లక్ష్యంగా పోటీ పడుతున్నాయి. 8లో ▸



న్యూస్‌రీల్

ముగిసిన ఈఏపీసెట్



సీఆర్‌ఆర్ కళాశాలలో విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలో ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాల నిమిత్తం ఈనెల 16న ప్రారంభమైన ఏపీ ఈఏపీసెట్–24 పరీక్షలు గురువారంతో ముగిశాయి. వరి రోజున ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ జరిగిన పరీక్షకు సిద్ధార్థ క్వెస్ట్ కాలేజీలో 182 మందికి గాను 178 మంది, ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలో 141 మందికి 136 మంది, సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 160 మందికి 155 మంది హాజరయ్యారు. మొత్తంగా ఉదయం సెషన్‌లో 481 మందికి 467 మంది హాజరయ్యారు. మొత్తంగా ఏలూరు జిల్లాలో 6,243 మందికి 5,992 మంది హాజరయ్యారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించారు.

కేంద్ర బృందం పర్యటన



పేకేరు సచివాలయంలో కేంద్ర బృంద అధికారులు

ఇరగవరం: ఢిల్లీ నుంచి కేంద్ర సచివాలయ సెక్షన్ అధికారులు గురువారం పేకేరు గ్రామంలో సచివాలయాన్ని సందర్శించారు. భారత్ దర్శన్ కార్యక్రమంలో భాగంగా మహిళా సాధికారత, మహిళలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తదితర వివరాలు తెలుసుకున్నారు. సర్పంచ్ కునుకు హేమకుమారి ఆయా వివరాలు వారికి తెలియజేశారు. ఇటీవల సర్పంచ్ హేమకుమారి ఐక్యరాజ్య సమితిలో మహిళా సాధికారతపై దేశం తరపున ప్రాతినిధ్యం వహించడంపై కేంద్ర బృందం ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి ఎం.నవీన్‌కింగ్, అభిషేక్ దీక్షిత్, అభిషేక్ గుప్త, అప్రజిత రావత్, ఫాతిమా, కృష్ణకుమార్, ఈఓఆర్డీ పీవీఎల్ నరసింహమూర్తి, కార్యదర్శి పాల్గొన్నారు.

ఉద్యాన వర్సిటీలో క్యాంపస్ సెలెక్షన్స్



తాడేపల్లిగూడెం: మండలంలోని వెంకట్రామన్నగూడెం ఉద్యాన వర్సిటీలో జైన్ ఇరిగేషన్ సిస్టమ్స్ ప్రతినిధులు గురువారం క్యాంపస్ సెలెక్షన్స్ నిర్వహించారు. బీఎస్సీ హార్టీకల్చర్ ఫైనలియర్ విద్యార్థులకు రాత పరీక్ష, గ్రూపు డిస్కషన్స్, ఇంటర్వ్యూలను నిర్వహించగా 64 మంది విద్యార్థులకు 43 మంది గ్రూపు డిస్కషన్స్‌కు ఎంపికయ్యారు. ఇంటర్వ్యూల ఆధారంగా సుమారు 20 మంది విద్యార్థులను ఎగ్జిక్యూటివ్, సీనియర్ ఎగ్జిక్యూటివ్స్‌గా ఎంపిక చేయనున్నామని కంపెనీ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్, హ్యూమన్ రీసోర్స్ మేనేజర్ టి.రఘు, అగ్రనామిస్ట్ పి.రాజు తెలిపారు. ఉద్యాన వర్సిటీ వీసీ టి.జానకీరామ్ పర్యవేక్షించారు. వర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

సోమేశ్వరుడి శోభ




భీమవరం (ప్రకాశంచౌక్) : భీమవరం గునుపూడిలోని పంచారామక్షేత్రం సోమేశ్వర జనార్దనస్వామి దేవస్థానం (సోమారామం)లో వైశాఖ పౌర్ణమి సందర్భంగా స్వామివారికి మామిడి పండ్లతో అలంకరణ చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి.

ఏలూరుదే తొలి ఫలితం

- ఓట్ల లెక్కింపునకు అధికారుల సన్నాహాలు
- అసెంబ్లీకి 14, పార్లమెంట్‌కు 14 టేబుళ్లు
- పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌తో ప్రక్రియ ప్రారంభం
- జూన్ 4న ఉదయం 8 గంటలకు లెక్కింపు మొదలు
- ఏలూరు సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్‌లో పక్కా ఏర్పాట్లు
- సీసీ కెమెరాల నిఘాలో కౌంటింగ్
- చివరిగా నూజివీడు ఫలితం వెల్లడయ్యే అవకాశం



ఏలూరులోని స్ట్రాంగ్‌రూమ్‌లో ఈవీఎంలను సీసీ ఫుటేజీలో పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ (ఫైల్)



సాక్షి ప్రతినిధి,ఏలూరు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ఉత్కంఠ కొనసాగుతోంది.. ఏ పార్టీ గెలుస్తుంది.. ఎవరికి ఎన్ని సీట్లు వస్తాయి.. జిల్లాలో ఎక్కువ మెజార్టీ ఎవరికి వస్తుంది.. ఇలా ఎక్కడ చూసిన పొలిటికల్ ఫీవర్ కనిపిస్తోంది. ఏలూరు జిల్లాలో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ఏర్పాట్లపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. జిల్లాలో తొలి ఫలితం ఏలూరు నియోజకర్గం కాగా తుది ఫలితం నూజివీడు నియోజకవర్గానిది వెల్లడయ్యే అవకాశం ఉంది.

వచ్చేనెల 4న..

వచ్చే నెల 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించనున్నారు. ఎన్నికల ప్రక్రియలో తుది ఘట్టం, ఐదేళ్ల భవిష్యత్‌ను నిర్ణయించే కార్యక్రమం ఇదే. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఈనెల 13న జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని ఒక పార్లమెంట్ నియోజకవర్గం, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ఈవీఎంలు ఏలూరు సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌కు చేరుకున్నాయి. స్ట్రాంగ్ రూమ్‌తో పాటు కౌంటింగ్ సెంటర్లను కూడా అక్కడే ఏర్పాట్లుచేసి అవసరమైన సౌకర్యాలను కూడా అధికారులు సిద్ధం చేశారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక హాల్‌ను కేటాయించి ఏడు హాల్స్‌లో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంట్ నియోజకవర్గ ఓట్లను లెక్కించనున్నారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపుతో కౌంటింగ్ ప్రారంభిస్తారు. దాంతో పాటు సర్వీసు ఓట్లు, ఎలక్ట్రానిక్ బ్యాలెట్ ఓట్లను లెక్కించనున్నారు. పోస్టల్ బ్యాలెట్‌ను రెండు కేటగిరీలుగా విభజించి మ్యానువల్ ఓట్ల లెక్కింపు, ఎలక్ట్రానిక్ ఓట్ల లెక్కింపును వేర్వేరుగా చేపట్టనున్నారు.

14 టేబుళ్ల చొప్పున..

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక హాల్‌ను కేటాయించారు. ఒక్కో హాలులో 14 టేబుళ్లు అసెంబ్లీకి, 14 టేబుళ్లు పార్లమెంట్‌కు సిద్ధం చేసి రౌండ్ల వారీగా లెక్కించనున్నారు. ప్రతి రౌండ్‌లో 14 టేబుళ్ల ద్వారా లెక్కిస్తారు. నియోజకవర్గంలోని పోలింగ్ బూత్‌ల సంఖ్యను బట్టి రౌండ్లు కొనసాగనున్నాయి. తక్కువ బూత్‌లు ఉన్న చోట తక్కువ

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	రౌండ్లు
ఏలూరు	213	16
ఉంగుటూరు	214	16
కైకలూరు	235	18
దెందులూరు	239	18
చింతలపూడి	273	21
పోలవరం	284	22
నూజివీడు	286	22

రౌండ్లలోనే ఫలితం వెల్లడయ్యే అవకాశం ఉంది. ఎక్కువ బూత్‌లు ఉన్న చోట కాస్త ఆలస్యంగా ఫలితాలు వెల్లడి కానున్నాయి.

మధ్యాహ్నం 1 గంటకు తొలి ఫలితం

కౌంటింగ్ ప్రక్రియలో భాగంగా జిల్లాలో తక్కువ పోలింగ్ బూత్‌లు ఉన్న ఏలూరు నియోజకవర్గ ఫలితం మొదటగా వెల్లడయ్యే అవకాశం ఉంది. తర్వాత ఉంగుటూరు ఫలితం తేలనుంది. అలాగే చివరగా నూజివీడు నియోజకవర్గ ఫలితం వచ్చే అవకాశం ఉంది. తొలి ఫలితం మధ్యాహ్నం 1 గంటకు, తుది ఫలితం సాయంత్రం 6 గంటలకు వెలువడే అవకాశం ఉంది. ఓట్ల లెక్కింపు పూర్తయి విజేతలను ప్రకటించిన తర్వాత అధికారులు ధ్రువీకరణ పత్రాలు అందిస్తారు. అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పార్లమెంట్ ఓట్లను కూడా అసెంబ్లీ తరహాలోనే లెక్కిస్తారు. గెలుపొందిన ఎంపీ అభ్యర్థికి రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న జిల్లా కలెక్టర్ ధ్రువీకరణ పత్రం అందిస్తారు.

ఓట్ల లెక్కింపునకు పటిష్ట భద్రత

జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి



ఏలూరు టౌన్: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టామనీ, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి అన్నారు. ఏలూరు గిరిజన భవన్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రధాన అనుచరులు, నాయకులతో ఎన్నికల కౌంటింగ్‌పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కౌంటింగ్ నియమ, నిబంధనలు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేలా అందరూ సహకరించాలన్నారు. వచ్చేనెల 6 వరకు జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటాయన్నారు. కోడ్ అమల్లో ఉండగా నమోదయ్యే క్రిమినల్ కేసులన్నీ ప్రత్యేకంగా పరిగణించి ఎన్నికల కమిషన్ పర్యవేక్షణలో నిందితులకు శిక్షలు పడేలా ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ రోజు రాజకీయ పార్టీల ర్యాలీలు, సభలు, సమావేశాలకు అనుమతులు లేవన్నారు. జిల్లా అదనపు ఎస్పీ జి.స్వరూప రాణి, ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు, టూటౌన్ సీఐ ప్రభాకర్, త్రీటౌన్ సీఐ కె.శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు నూకపెయ్యి సుధీర్‌బాబు, మంచెం మైబాబు, మున్నుల జాన్‌గురునాథ్, సుంకర చంద్రశేఖర్, వివిధ రాజకీయ పార్టీల నేతలు హాజరయ్యారు.

కౌంటింగ్‌కు సర్వ సన్నద్ధం



రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ, డీఆర్వో, ఐటీడీఏ పీఓ

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు తదితర అంశాలపై రాష్ట్ర సచివాలయం నుంచి చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఏలూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వె.ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ, డీఆర్వో డి.పుష్పమణి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కౌంటింగ్ ప్రక్రియకు సర్వ సన్నద్ధంగా ఉన్నామన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత, మీడియా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కౌంటింగ్‌కు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్, కౌంటింగ్ కోసం అదనపు ఏఆర్వోలు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లను నియమించామన్నారు. మొదటి ర్యాండమైజేషన్, శిక్షణా కార్యక్రమం ఈనెల 27న నిర్వహిస్తామన్నారు. ఆర్వోలు ఎం.ముక్కంటి, ఎస్‌ఎస్‌కే ఖాజావలీ, కె.అద్దయ్య, వై.భవానీ శంకరి, కె.భాస్కర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బాబ్జి, ఏఓ కె.కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

అవాంఛనీయ సంఘటనలను ఉపేక్షించం

ఓట్ల లెక్కింపు సందర్భంగా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. కౌంటింగ్‌కు అందరూ సహకరించాలన్నారు. అభ్యర్థులు వారి కౌంటింగ్ ఏజెంట్లుగా పంపే వారి పూర్తి వివరాలను ఫారం–18లో నెలాఖరులోపు సమర్పించాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వాచ్‌లను అనుమతించమన్నారు. రౌండ్ల వారీగా ఫలితాలను ప్రదర్శిస్తామన్నారు. కౌంటింగ్ ప్రక్రియ మొత్తం వీడియోగ్రఫీ చేస్తారన్నారు. ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థుల విజయోత్సవాల్లో భాగంగా ఊరేగింపులు, ర్యాలీలు, బాణసంచా కాల్పులకు అనుమతి లేదన్నారు. ఓట్ల లెక్కింపునకు నిర్దేశిత గుర్తింపు కార్డులతో హాజరుకావాలన్నారు. డీఆర్వో డి.పుష్పమణి, రాజకీయ పార్టీల ప్రతినిధులు టీఆర్‌ఆర్ మోహన్ రావు (వైఎస్సార్‌సీపీ), ఎంఎల్‌ఎస్‌ఏ కుమార్ (కాంగ్రెస్), కె.బాలకృష్ణ (తెలుగుదేశం), బి.రాజు (నవరంగ కాంగ్రెస్ పార్టీ), డి.ఆదర్ష్ (లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ), తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి రథోత్సవం రద్దు

- అనివార్య కారణాలతో నిలిచిన వేడుక
- ఆకట్టుకున్న రాజమన్నార్ అలంకారం



రాజమన్నార్ అలంకారంలో శ్రీవారు



గుడి సెంటర్‌లో ముస్తాబైన శ్రీవారి రథం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చిన వెంకన్న వైశాఖ మాస దివ్య బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి నిర్వహించాల్సిన రథోత్సవం అనివార్య కారణాలతో రద్దయ్యింది. వేడుకను వైభవంగా నిర్వహించేందుకు ఉదయం నుంచి దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. గుడి సెంటర్‌లో రథాన్ని సుగంధభరిత పుష్ప మాలికలు, విద్యుద్దీప తోరణాలతో శోభాయమానంగా అలంకరించారు. అయితే అనివార్య కారణాలు వల్ల రథయాత్రకు ఆటంకం కలిగింది. దీంతో అర్చక స్వాముల సూచనల మేరకు ఆలయ అధికారులు వేడుకను రద్దు చేశారు. ఇదిలా ఉంటే ఆలయ ముఖ మండపంలో స్వామివారు రాజమన్నార్ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే శ్రీహరి కళాతోరణ వేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

బ్రహ్మోత్సవాల్లో నేడు

- ఉదయం 7 గంటల నుంచి–భజన కార్యక్రమాలు
- ఉదయం 10 గంటల నుంచి భక్తిగీతాల ఆలాపన
- ఉదయం 10.30 గంటల నుంచి – చక్రవారి – అవభృథోత్సవం
- ఉదయం 11 గంటల నుంచి – కూచిపూడి భరత నాట్య ప్రదర్శనలు
- మధ్యాహ్నం 3 గంటల నుంచి – వేద సభ
- సాయంత్రం 4 గంటల నుంచి – నాదస్వర కచేరి
- సాయంత్రం 5 గంటల నుంచి – అన్నమాచార్య భక్తి గీతాలాపన
- సాయంత్రం 5 గంటల నుంచి – కూచిపూడి భరతనాట్య ప్రదర్శనలు
- రాత్రి 7 గంటల నుండి – పూర్ణాహుతి, మౌనబలి, ధ్వజావరోహణ
- రాత్రి 8 గంటల నుండి అశ్వవాహనంపై గ్రామోత్సవం
- ప్రత్యేక అలంకారం : మురళీకృష్ణ

కమనీయం.. కాళ్లకూరు రథోత్సవం



కాళ్లకూరులో రథోత్సవ దృశ్యం

కాళ్ల: కాళ్లకూరులో వేంకటేశ్వరస్వామి (వెంకన్న) తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. తొలుత రథంపై ఆశీనులైన స్వామివారికి విశేష పూజలు చేశారు. అనంతరం గ్రామ పెద్దలు, భక్తులు రథాన్ని లాగి రథోత్సవం ప్రారంభించారు. రథోత్సవంలో బుట్టబొమ్మలు, శక్తివేషాలు, తీన్మార్ డప్పులు, మేళతాళాలు భక్తులను ఆకట్టుకున్నాయి. పురవీధుల మీదుగా సాగిన రథోత్సవాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలి వచ్చారు. స్వామి వారికి నిత్యోపాసన, బలిహరణ, పంచసూక్త హవనం, రజత పుష్పాలతో విశేష పూజ, నీరాజన మంత్రపుష్ప ప్రసాద వినియోగం వంటి పూజాదికాలు జరిపించారు.

అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీకి సర్వం సిద్ధం

- నేటి నుంచి పరీక్షల నిర్వహణ
- ఇంటర్ పరీక్షలకు 12,797 మంది..
- టెన్త్ పరీక్షలకు 11,533 మంది హాజరు



భీమడోలులో సప్లిమెంటరీ పరీక్షల గదిలో బెంచీలపై హాల్‌టికెట్ల నంబర్లు వేస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో శుక్రవారం నుంచి 10వ తరగతి, ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 1 వరకు, టెన్త్ పరీక్షలు జూన్ 3 వరకు జరుగనున్నాయి. ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండియర్ పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తారు. జిల్లాలో 27 కేంద్రాలను ఏర్పాటుచేయగా మొత్తంగా 12,797 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. జూన్ 6న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష, 7న ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షలను ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 124 కేంద్రాల్లో నిర్వహిస్తారు. వీటిని ఇంటర్ విద్యార్థులు తప్పనిసరిగా రాయాల్సి ఉంటుంది. పరీక్షల నిర్వహణకు 27 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 27 మంది అసిస్టెంట్ సూపరింటెండెంట్లు, 280 మందికి పైగా ఇన్విజిలేటర్లను నియమించారు. విద్యార్థులకు సమస్యల పరిష్కారానికి ఏలూరులో కంట్రోల్ రూమ్ 08812 230197 నంబర్‌ను ఏర్పాటుచేశారు.

టెన్త్ పరీక్షలకు 50 కేంద్రాలు

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహిస్తారు. జిల్లాలో 11,500 మంది విద్యార్థులు హాజరుకానుండగా 50 పరీక్షా కేంద్రాలు సిద్ధం చేశారు. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షణ చేయనున్నారు. నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటుచేశారు. కేంద్రాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ నెంబర్ 8121840400కు లేదా జిల్లా విద్యాశాఖాధికారి సెల్ 9849909105 నంబర్‌కు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్యలో తెలియజేయవచ్చు. విద్యార్థులు గంట ముందుగా కేంద్రాల వద్దకు చేరుకోవాలి. కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేస్తున్నారు. పరీక్ష సమయానికి అనుగుణంగా కేంద్రాల వద్దకు ఆర్టీసీ బస్సులు నడపాలని ఆ శాఖ అధికారులకు ఆదేశాలు అందాయి.

పక్కాగా ఏర్పాట్లు

విద్యార్థులు హాల్‌టికెట్‌తో పాటు గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకెళ్లాలని అధికారులు సూచించారు. కేంద్రాల వద్ద నిరంతరాయంగా విద్యుత్ సరఫరాకు, దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మొబైల్ ఫోన్లు, కాలిక్యులేటర్లు, ఐప్యాడ్, బ్లూటూత్, పేజర్ లేదా ఇంట్రాక్ట్ ప్రోగ్రామింగ్ చేయగల ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను కేంద్రంలోకి అనుమతించరు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి వైద్య శిబిరాలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. పరీక్షలు జరిగే తేదీల్లో ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తారు. అలాగే పరిసర ప్రాంతాల్లో కంప్యూటర్ సెంటర్లు, జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ఇన్విజిలేటర్ల కొరత ఏర్పడినచోట సంబంధిత మండల విద్యాశాఖ అధికారులను సమన్వయం చేసి ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకున్నారు.

పరీక్షలు	జనరల్ విద్యార్థులు	ఒకేషనల్ విద్యార్థులు
ఇంటర్మీడియెట్		
ఫస్టియర్	7,744	920
సెకండియర్	3,209	924
టెన్త్ పరీక్షలు		
బాలురు	6,970	
బాలికలు	4,563	
మొత్తం	11,533	

డీఈఓ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

డీఆర్వో పుష్పమణి



ఏలూరు(మెట్రో): ఏపీపీఎస్సీ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (డీఈఓ) పరీక్షలను ఈనెల 25న జిల్లాలోని రెండు కేంద్రాల్లో నిర్వహించనున్నారని డీఆర్వో, జిల్లా సమన్వయ అధికారి డి.పుష్పమణి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడూతూ జిల్లాలో పరీక్షలకు 320 మంది అభ్యర్థులు హాజరు కానున్నారన్నారు. ఏలూరు సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్‌ఈ స్కూల్, ఏలూరు ఇంజనీరింగ్ టెక్నాలజీ కాలేజీలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేశారన్నారు. కంప్యూటర్ ఆధారిత పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవుతాయని, అభ్యర్థులు ఉదయం 8.30 గంటలలోపు కేంద్రాల్లోకి చేరుకోవాలన్నారు. ఒక్కో కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్, లైజన్ ఆఫీసర్‌ను నియమించామన్నారు. కేంద్రాల్లోకి పేపర్లు, మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద మౌలిక వసతులు కల్పించామని, హెల్త్ క్యాంప్‌లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

క్లుప్తంగా

మట్టి రవాణా చేస్తున్న 3 ట్రాక్టర్లు సీజ్

నిడమర్రు: చానమిల్లి గ్రామంలో అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న 3 ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తహసీల్దారు కె.పోసిబాబు చెప్పారు. గురువారం చానమిల్లి గ్రామంలో గనులు, భూగర్భశాఖ అధికారుల అనుమతులు లేకుండా అక్రమంగా పొలాల్లోని మట్టిని తవ్వితరలిస్తున్నట్లు సమాచారం రావడంతో వెంటనే ఆయా ట్రాక్టర్లను తహసీల్దారు కార్యాలయం వద్ద సీజ్ చేసి, మట్టిని తరలిస్తున్న యర్ర సాయి (బావాయిపాలెం), అచ్యుత వెంకట సత్యరామాంజనేయులు (రావులపాలెం), దాసరి జయరాజు (జగ్గవరం గ్రామం, టి.నరసాపురం మండలం)లపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మట్టిని ఒకచోట నుంచి మరో చోటికి తరలించాలంటే తప్పనిసరిగా అధికారులు అనుమతుల తీసుకోవాలన్నారు. ఎటువంటి అనుమతులు తీసుకోకుండా మట్టిని తరలిస్తే భూయజమానులపై, మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న వ్యక్తులు, వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు. ఆర్ఐ ఆర్.సుబ్బారావు, వీఆర్వో ఏడుకొండలు తదితరులున్నారు.

సీపీఎఫ్ ఫ్యాక్టరీ మూసివేతతో ఆందోళన



సరిపల్లెలో ఫ్యాక్టరీ వద్ద ఉద్యోగులతో చర్చలు జరుపుతున్న అధికారులు

గణపవరం: రొయ్యలు, చేపల మేతలు తయారు చేసే సరిపల్లెలోని సీపీఎఫ్ కర్మాగారాన్ని నిర్వాహకులు మూసివేయడంతో దీనిలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు. బుధవారం ఫ్యాక్టరీ గేట్లకు యాజమాన్యం తాళాలు వేసి కర్మాగారాన్ని మూసివేస్తున్నట్లు ప్రకటించడంతో ఉద్యోగులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అర్ధాంతరంగా ఫ్యాక్టరీ మూసివేస్తే తామంతా ఉపాధి కోల్పోయి వీధిన పడతామని కార్మికశాఖ అధికారులతో చర్చలు జరిపినా ఫలితం లేకపోవడంతో తమకు న్యాయం చేయాలంటూ ఉద్యోగులు జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించారు. దశాబ్దకాలం క్రితం థాయిలాండ్‌కు చెందిన సీపీఎఫ్ కంపెనీ సరిపల్లెలో చేపలు, రొయ్యల మేతల తయారీ కర్మాగారాన్ని నెలకొల్పింది. దీనిలో సుమారు 100 మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. దేశ వ్యాప్తంగా పలు ప్రాంతాలలో ఫ్యాక్టరీలను నెలకొల్పగా, ప్రస్తుతం అన్ని ఫ్యాక్టరీలు నష్టాల బాటలో ఉన్నాయనే సాకుతో లాభాలబాటలో నడుస్తున్న సరిపల్లె యూనిట్‌ను సైతం మూసివేశారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. గురువారం కూడా ఉద్యోగులు కంపెనీ గేటువద్ద ఆందోళన చేశారు. అయితే కలెక్టర్‌తో జరిగే చర్చల ద్వారానైనా తమకు న్యాయం జరుగుతుందన్న ఆశాభావంతో ఉద్యోగులు ఉన్నారు. తాము ఉద్యోగాలు కోల్పోతే ఎలా బతకాలంటూ వారు ఆందోళన చెందుతున్నారు. కనీసం తమకు కొంతమొత్తం పరిహారంగానైనా చెల్లించి ఆదుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

ఉత్సాహంగా ఉప్పు సాగు

- పెరిగిన గిట్టుబాటు ధరతో ఆనందం
- గతంతో పోలిస్తే సగానికి తగ్గిన విస్తీర్ణం
- భయపెడుతున్న అకాల వర్షాలు



నరసాపురం మండలం పెదమైనవానిలంకలో ఉప్పుసాగు చేస్తున్న దృశ్యం



పండించిన ఉప్పును గట్టు మీదే గుట్టలుగా నిల్వ ఉంచిన దృశ్యం (ఫైల్)

నరసాపురం: జిల్లాలోని నరసాపురం తీరంలో ఈ ఏడాది ఉప్పు సాగు ఉత్సాహంగా సాగుతోంది. రైతులు మార్చి నెల ప్రారంభంలోనే సాగుకు ఉపక్రమించారు. ప్రస్తుతం తీర గ్రామాల్లో ఉప్పు సాగు ముమ్మరంగా సాగుతోంది. ఓ పక్క ఎప్పుడూలేని విధంగా ఉప్పుకు గిట్టుబాటు ధర పెరిగింది. దీంతో రైతులు ఆనందంగా ఉన్నారు. అదే సందర్భంలో కొన్నిరోజులుగా అకాల వర్షాలు, వాతావరణశాఖ రానున్న రోజుల్లో తుపాను హెచ్చరికలు జారీ చేయడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో నరసాపురంలో 19 కిలోమీటర్లు ఉన్న తీరప్రాంతంలో 1,500 ఎకరాల్లో ఉప్పు సాగు చేపట్టారు. నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని వేములదీవి, తూర్పుతాళ్లు, చినమైనవానిలంక, పెదమైనవానిలంక, పేరుపాలెం, కేపీపాలెం తదితర 8 గ్రామాల్లో ఉప్పుసాగు జరుగుతోంది.

6 నెలల వరకూ దిగుబడి : ఉప్పు సాగు సమష్టి కృషితో కూడుకున్న పని. ఒక్కసారి మడి కడితే దాదాపు ఆ మడి నుంచి 6 నెలల వరకూ ఉప్పు తీస్తుంటారు. దీంతో ఉప్పు సాగు లాభాలు తెచ్చిపెడుతుంది. వేసవి ప్రారంభంలో ఏటా మార్చిలో ఉప్పుసాగు ప్రారంభం అవుతుంది. మండే ఎండల్లో చిన్న చిన్న మడులను ఏర్పాటు చేసి ఉప్పు సాగు చేస్తారు. ఒక్కో ఎకరానికి సంబంధించి 60 నుంచి 70 మడులను కడతారు. ముందుగా మడుల్లో మట్టిని కాళ్లతో తొక్కి చదును చేసి తరువాత సముద్రంలోని ఉప్పు నీటిని ఆ మడుల్లో నింపుతారు. ఇక సాగు ప్రారంభమైన నాటి నుంచి మడుల్లో 60 రోజుల పాటు 6 నుంచి 10 మంది విపరీతంగా శ్రమిస్తేనే కానీ ఉప్పు తయారీ కాదు. ఉప్పుమడి నుంచి దాదాపు 6 నెలలు వరకూ ఉప్పు ఉత్పత్తి చేస్తారు. ఒక్కో ఎకరానికి పెట్టుబడి రూ.15,000 నుంచి రూ.20 వేల వరకు ఖర్చవుతూ ఉంటుంది. వాతావరణం అనుకూలిస్తే ఎకరాకు రోజుకు 100 కిలోల వరకూ ఉత్పత్తి వస్తుంది.

జిల్లాలో తీర ప్రాంతం	ఉప్పు సాగు చేసే గ్రామాలు	ఏటా తీరంలో ఉత్పత్తి అయ్యే ఉప్పు
19 కిలోమీటర్లు	8	2 వేల టన్నులు
ప్రస్తుతం ఉప్పు సాగు చేసే విస్తీర్ణం	**ఉప్పు సాగుపై ఆధారపడి జీవిస్తున్న రైతులు**	**పరోక్షంగా ఉప్పు సాగుపై ఆధారపడి జీవిస్తున్న వారు**
1500 ఎకరాలు	800 మంది	2 వేల మంది

పెరిగిన గిట్టుబాటు ధర

ఇటీవల పండించిన ఉప్పుకు గిట్టుబాటు ధర కూడా పెరగడంతో రైతులు ఒకింత ఆనందంలో ఉన్నారు. ఏడాది క్రితం తీరంలో పండించే ఉప్పు బస్తా (50 కిలోలు) రైతుల వద్ద దళారులు రూ.100కు కొనేవారు. ప్రస్తుతం బస్తా ధర రూ.300 పలుకుతోంది. గిట్టుబాటు ధర మూడు రెట్లు పెరిగిన ఆనందంలో రైతులు ఉన్నారు. వాతావరణం సహకరించి అకాల వర్షాల బెడద లేకుండా ఉంటే రైతులకు నాలుగు డబ్బులు వస్తాయి. కొన్ని రోజుల నుంచి అకాల వర్షాలు భయపెడుతున్నాయి. ఇప్పటికైతే పరవాలేదని, కానీ భారీ వర్షాలు పడితే మాత్రం ఉప్పు రైతులు నష్టపోతారు.

సగానికి తగ్గిన సాగు విస్తీర్ణం...

నరసాపురం తీరం నుంచి ఉప్పు ఆంధ్రా, తెలంగాణలోని పలు ప్రాంతాలకు ఎగుమతి అవుతుంది. ఉభయగోదావరి జిల్లాలోని అన్ని ప్రాంతాలకు ఇక్కడి నుంచే ఉప్పు సరఫరా అవుతోంది. కొంతకాలంగా ఉప్పు సాగు కష్టాల సుడిలో కొట్టుమిట్టాడుతోంది. ఎక్కువ శ్రమ, తక్కువ రాబడితో రైతులు సాగుకు మొగ్గుచూపడంలేదు. క్రమంగా తీరంలో ఉప్పుమడులు చేపలు, రొయ్యల చెరువులుగా మారుతున్నాయి. ఆక్వా వైపు ఉప్పు రైతులు అడుగులు వేస్తున్నారు. 10 ఏళ్ల క్రితం తీరంలో దాదాపు 15 గ్రామాల్లో 4 వేల ఎకరాల్లో ఉప్పుసాగు జరిగేది. ప్రస్తుతం సాగు విస్తీర్ణం సగానికి సగం పడిపోయింది.

పంటకు బీమా కల్పించాలి

పండించిన ఉప్పును భద్రపరచుకోవడానికి గిడ్డంగులు లాంటి సదుపాయాలు లేవు. గిడ్డంగులు ఉంటే వర్షాలు వచ్చినప్పుడు పండించిన ఉప్పును వాటిలో భద్రపరుచుకుని మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకోవచ్చు. పండించిన ఉప్పును రైతులు ఆరుబయటే కుప్పలుగా పోసి ఉంచుతారు. దీంతో పండించిన ఉప్పు పంటకు రక్షణ ఉండదు. అకస్మాత్తుగా వర్షాలు పడినా, తుపాన్లు వంటి విపత్తులు వచ్చినా ఉప్పు కుప్పలు ధ్వంసమైపోతాయి. ఉప్పు పంటకు బీమా లాంటి సదుపాయాలు ఉండవు. ఉప్పు సాగును అధికార పంటగా గుర్తించాలని, మిగిలిన పంటలకు మాదిరిగా అందించే సదుపాయాలు కలుగజేయాలనే డిమాండ్ ఎంతోకాలంగా ఉంది.

గత ఏడాదంతా నష్టమే



మార్చి నెలలోనే ఉప్పుసాగు సీజన్ మొదలవుతుంది. ఈ ఏడాది అలాగే ప్రారంభమైంది. గత ఏడాది జూన్, జూలై నెలల్లోనే అధిక వర్షాలు పడ్డాయి. దీంతో మడుల్లోకి నీరు చేరింది. అప్పటికే పండించిన ఉప్పును అయిన కాడికి అమ్ముకున్నాం. అన్నీ నష్టాలే మిగిలాయి. ఈ ఏడాది కూడా వర్షాలు భయపెడుతున్నాయి. ముమ్మందు వాతావరణం ఎలాగుంటుందో చూడాలి.

మైలా ముత్యాలరాజు,
ఉప్పు రైతు, పెదమైనవానిలంక గ్రామం

ధర పెరగడంతో లాభాలు



50 కేజీల బస్తా రూ.300 పలుకుతోంది. ఈ మధ్యనే రేటు పెరిగింది. గత ఏడాది వరకూ బస్తా రూ.100కు మించి ఇచ్చేవారు కాదు. రొయ్యల చెరువులకు కూడా ఉప్పును ఉపయోగించడంతో డిమాండ్ పెరిగి రేటు పెరిగింది. ఈ ఏడాది కాస్త లాభాలు చూస్తామనుకుంటున్నాం.

– పొన్నమండ నాగరాజు, ఉప్పు రైతు,
తూర్పుతాళ్లు, నరసాపురం మండలం

చింతపల్లి ఘటనలో నిందితులకు రిమాండ్

- పదో తరగతి విద్యార్థి ఘాతుకం
- ఫోన్ ద్వారా వీడియో తీసి వేధింపులకు దిగిన నలుగురు యువకులు
- పోలీసులను ఆశ్రయించిన బాధిత బాలిక తల్లి
- జువైనల్ హోంకు నిందితుడు తరలింపు
- నలుగురు యువకులపై పోక్సో కేసు నమోదు



ఘటన జరిగిన చింతపాడు హైస్కూల్

కైకలూరు: ఏడో తరగతి చదువుతున్న విద్యార్థినిపై పదో తరగతి విద్యార్థి లైంగిక దాడికి పాల్పడగా..ఆ దృశ్యాన్ని రహస్యంగా సెల్‌ఫోన్‌లో వీడియో తీసిన నలుగురు యువకులు బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఏలూరు జిల్లా మండవల్లి మండలం చింతపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 15న ఈ ఉదంతం చోటుచేసుకుంది. సమీప గ్రామానికి చెందిన బాలిక (14) కైకలూరులోని ఓ ప్రైవేటు స్కూల్‌లో ఏడో తరగతి చదువుతోంది. కొవ్వాడలంక గ్రామానికి చెందిన బాలుడు (16) ఇటీవల పదో తరగతి పరీక్షలు రాశాడు. ఆ పరీక్ష సర్టిఫికెట్లు తీసుకోవాలని పాఠశాలకు వచ్చాడు. అక్కడ కలిసిన బాలికకు మాయమాటలు చెప్పి పాఠశాల వెనుక భాగానికి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఇదే సమయంలో అటుగా వెళుతున్న యువకులు కొవ్వాడలంకకు చెందిన బలే బాల సుబ్రహ్మణ్యం, ఘంటసాల చంద్రశేఖర్, పెద్దిశెట్టి నాగధర్మ తేజ, జయమంగళ హరికృష్ణ ఈ లైంగిక దృశ్యాలను సెల్‌ఫోన్‌లో రహస్యంగా చిత్రీకరించారు. అనంతరం ఆ వీడియోలను చూపించి తాము అడిగిన సొమ్ము ఇవ్వకపోతే వాటిని సోషల్ మీడియాలో పెడతామంటూ బాలికను బెదిరించారు. ఆ బాలిక సొమ్ము ఇవ్వకపోవడంతో వారు వీడియోలను వాట్సాప్ గ్రూప్‌లలో వైరల్ చేశారు. దీంతో వాటిని చూసిన బాలిక తల్లి కూతురిని నిలదీయగా జరిగిన విషయం చెప్పింది. మండవల్లి పోలీసులకు బుధవారం బాలిక తల్లి ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించిన పోలీసులు బాలుడిని అదుపులోకి తీసుకుని జువైనల్ హోమ్‌కు తరలించారు. బెదిరింపులకు పాల్పడిన యువకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. ఘంటసాల చంద్రశేఖర్‌పై ఇప్పటికే మూడు కేసులున్నాయి.

కఠినమైన కేసులు నమోదు చేశాం

బాలికపై లైంగిక దాడికి పాల్పడిన బాలుడిని ఇప్పటికే జువైనల్ హోంకి పంపించాం. లైంగిక దాడి వీడియోలను తీసి వాట్సాప్ గ్రూప్‌లో పెట్టిన నలుగురిపై పోక్సో కేసు నమోదు చేశాం. వీటితోపాటు కఠినమైన కేసులను అదనంగా నమోదు చేశాం. బాలిక తల్లి ఫిర్యాదు చేయగానే తక్షణం స్పందించాం. నిందితులు రిమాండ్‌లో ఉన్నారు.

– బి.కృష్ణకుమార్, కైకలూరు రూరల్ సర్కిల్, సీఐ

విద్యుత్ చౌర్యంపై కేసు నమోదు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని దేవరపల్లి మండలం లక్ష్మీపురం గ్రామంలో అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తున్నారని అందిన సమాచారంపై ఏలూరు విద్యుత్ విజిలెన్స్ అధికారులు, సిబ్బంది ఆకస్మిక దాడులు చేసి ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ట్రాన్స్‌కో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ వి.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తమ అధికారుల తనిఖీ సమయంలో పోతునూరి వెంకట సురేష్ అనే వ్యక్తి తన గృహంలోని ఏసీలకు విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తున్నట్లు గుర్తించామన్నారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వెంకట సురేష్‌పై కేసు నమోదు చేసి అతనికి రూ.45,235 అపరాధ రుసుము, రూ.3 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. జిల్లాలో ఎవరైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

వేధింపులతో విద్యుత్ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

- జేఏఓ బి.కృష్ణవేణి వేధింపులతో ఉద్యోగుల్లో మనస్తాపం
- రెండేళ్ల క్రితమే ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు
- బాధితుని భార్య ఫిర్యాదు చేసినా ఎఫ్ఐఆర్ నమోదు చేయని పోలీసులు
- విచారణకు ఎస్ఈ ఆదేశం

ఏలూరు (ఆర్ఆర్ పేట): ఏపీఈపీడీసీఎల్ ఏలూరు సర్కిల్ కార్యాలయంలో అధికారిణి వేధింపులు భరించలేక ఓ ఉద్యోగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేకెత్తించింది. వివరాలిలా ఉన్నాయి. ఏలూరులోని సంస్థ సర్కిల్ కార్యాలయంలోని ఏడీఎం విభాగంలో జూనియర్ అకౌంట్స్ అధికారిగా పని చేస్తున్న బి.కృష్ణవేణి తన కింది అధికారులను గత కొన్నేళ్లుగా వేధింపులకు గురిచేస్తున్నారు. దీనిపై ఉద్యోగులు పలుసార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. 2022 ఫిబ్రవరి 13న కార్యాలయంలో పనిచేసే పి.నళిని విద్యుత్ సంస్థ సీజీఎంకు, వి.అర్జునరావు, పి.శేషుకుమారి, ఆర్.అనిల్ కృష్ణ, సీహెచ్ శ్రీలక్ష్మి వేర్వేరుగా ఏలూరు ఈఈకి ఫిర్యాదులు చేశారు. అయినా అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. ఇదిలా ఉండగా గత బుధవారం కార్యాలయంలోని ఏడీఎం విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బి.కృష్ణకిషోర్ ఆమె వేధింపులు భరించలేక మనస్తాపంతో కార్యాలయంలోని మూడంతస్తుల భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించగా, తోటి ఉద్యోగులు అతన్ని వారించి రక్షించారు. ఈ ఘటనపై కృష్ణకిషోర్ భార్య జి.జ్యోతిర్మయి బుధవారం ఏలూరు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు గురువారం ఇరువర్గాలను స్టేషన్‌కు పిలిచి విచారణ చేశారు. అయితే జ్యోతిర్మయి ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. జేఏఓ కృష్ణవేణికి ఎస్పీ కార్యాలయంలో ఉన్న పరిచయాల నేపథ్యంలో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా తాత్సారం చేస్తున్నారని విద్యుత్ ఉద్యోగుల సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. బాధితుడు కృష్ణ కిషోర్ భార్య జ్యోతిర్మయి పోలీసులతో పాటు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, విద్యుత్ ఉద్యోగ సంఘాల నాయకులకు తన గోడును వెళ్లబోసుకుని ఫిర్యాదులు చేశారు. దీంతో ఉద్యోగ సంఘాల నాయకులు స్పందించి వెంటనే జేఏఓ కృష్ణవేణిపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని సర్కిల్ ఎస్ఈ సాల్మన్ రాజును కలిసి కోరారు. దీనిపై ఎస్ఈ స్పందించి విచారణకు ఆదేశించారు. కృష్ణకిషోర్ ఆత్మహత్యాయత్నానికి గల కారణాలపై పూర్తి స్థాయిలో విచారణ చేసి మూడు రోజుల్లో తనకు నివేదిక ఇవ్వాలని ఏలూరు కన్‌స్ట్రక్షన్స్ ఈఈ టి.శశిధర్‌ను ఎస్ఈ లిఖితపూర్వకంగా ఆదేశించారు.

160 కిలోల గంజాయి స్వాధీనం

- మహారాష్ట్రకు చెందిన ఇద్దరి నిందితుల అరెస్టు
- కలపర్రు టోల్‌ప్లాజా వద్ద తనిఖీల్లో పట్టివేత
- ఎస్ఈబీ ఏఎస్పీ సూర్యచంద్రరావు వెల్లడి



పట్టుబడిన గంజాయి, వాహనం, ఇద్దరు నిందితులు

ఏలూరు టౌన్: కలపర్రు టోల్‌ప్లాజా వద్ద అక్రమంగా కారులో తరలిస్తున్న 160 కిలోల గంజాయిని పట్టివేసినట్లు ఎస్ఈబీ అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు చెప్పారు. బుధవారం తన కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. ఎస్పీ డీ.మేరీప్రశాంతి ఆదేశాలతో కలపర్రు టోల్‌ప్లాజా వద్ద గురువారం ఉదయం ఏలూరు ఎస్ఈబీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.విద్యాసుధాకర్, ఎస్సై పి.శివప్రసాద్, జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు, సిబ్బంది వాహన తనిఖీలు చేయగా, ఓ కారులో 8 గోనెసంచుల్లో ఒక్కో సంచిలో 10 ప్యాకెట్లు చొప్పున, ప్రతి ప్యాకెట్‌లో రెండు కేజీల చొప్పున సుమారుగా 160 కిలోల గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ఈ గంజాయి విలువ సుమారుగా రూ.10.55 లక్షలు ఉంటుందని అంచనా వేశామన్నారు. ఈ గంజాయిని మహారాష్ట్ర థానే జిల్లా బిపన్ గ్రామానికి చెందిన అతిక్యూ అహ్మద్, బరమతి గ్రామానికి చెందిన జుమీర్ పింజరీ అనే ఇద్దరు వ్యక్తులు కారులో రవాణా చేస్తున్నారన్నారు. వీరిద్దరినీ ఎస్ఈబీ అధికారులు అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

యూత్ బాస్కెట్‌బాల్ పోటీల్లో పశ్చిమ జట్ల హవా



వరుస విజయాలు సాధిస్తున్న ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ జట్టు

ఏలూరు రూరల్: రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా బాస్కెట్ బాల్ బాలబాలికల జట్లు సత్తా చాటుతున్నాయి. రెండురోజులుగా విజయవాడలో స్టెల్లా కాలేజ్ ఆవరణలో జరుగుతున్న 7వ రాష్ట్ర స్థాయి యూత్ బాస్కెట్‌బాల్ పోటీల్లో జిల్లా బాలబాలికల జట్లు ప్రత్యర్థి జట్లను చిత్తుచేసి వరుస విజయాలు సాధిస్తున్నాయి. బుధవారం జరిగిన పోటీల్లో బాలికల జట్టు శ్రీకాకుళం జట్టును 45–08 స్కోర్ తేడాతో ఓడించింది. ఇదే క్రమంలో బాలుర జట్టు అనంతపురం జట్టుపై 47–31 స్కోర్‌తో గెలుపొందింది. గురువారం జరిగిన పోటీల్లో బాలికల జట్టు విశాఖపట్టణం జట్టును 54–28 స్కోర్‌తో, చిత్తూరు జట్టును 55–26 స్కోర్‌తో ఓడించి విజయ పరంపర కొనసాగించింది. బాలుర జట్టు కృష్ణా జిల్లా జట్టును 64–54 స్కోర్‌తో ఓడించి ముందంజ వేసింది. క్రీడాకారులను సీనియర్ క్రీడాకారులు రమేష్, సత్యం అభినందించారు. శుక్రవారం జరిగే పోటీల్లో జిల్లా జట్లు విజయం సాధిస్తే ఫైనల్‌కు చేసుకుంటాయని జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కార్యదర్శి గవ్వ శ్రీనివాస్, కోశాధికారి కె మురళీకృష్ణ అన్నారు. ఈ నెల 21న ప్రారంభమైన ఈ పోటీలు 24న ముగుస్తాయి.